ప్రజాశక్తి
శనివారం 18 జనవరి 2025 5 అనంతపురం






అనంతపురం నగరపాలకసంస్థ కార్యాలయం

ప్రయోగశాలగా అనంతపురం కార్పొరేషన్

- నెలన్నర కాలంలో ఇద్దరు కమిషనర్లు మార్పు
- ప్రభుత్వ ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లిఖార్జునరెడ్డి వారం రోజుల క్రితం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరణ
- తాజాగా ప్రొబేషన్ కమిషనర్‌గా శిక్షణ కలెక్టర్ వినూత్న

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

కమిషనర్ల నియామకంలో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ప్రయోగశాలగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తగ్గట్టుగానే గడచిన నెలన్నర కాలంలోనే ఇద్దరు కమిషనర్లు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. వారి స్థానంలో ఎఫ్ఎసి కమిషనర్‌గా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ వి. మల్లికార్జున రెడ్డిని నియమించారు. దీంతో వారం రోజుల క్రితం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు అయితే వరుసగా ఐదు రోజులపాటు సంక్రాంతి సెలవులు వచ్చాయి గురువారం వర్కింగ్ డే కావడంతో ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. గడచిన 30 రోజుల కాలంలోనే ఇద్దరు కమిషనర్లు దీర్ఘకాలిక సెలవు వెళ్లగా తాజాగా మూడో కమిషనర్ గా వి మల్లికార్జున్‌రెడ్డి వారం రోజుల క్రితం బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ప్రొబేషన్ కమిషనర్‌గా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వచ్చిన వారు వచ్చినట్టుగానే సెలవులు పెట్టి వెళ్తుండటంతో అభివృద్ధి పనులకు సంబంధించిన ఫైళ్లు, బిల్లులకు సంబంధించిన ఫైళ్ల ఇతరత్రా బిల్లులకు గ్రహణం పట్టుకుంది. ఇద్దరు కమిషనర్లు తమ లాగిన్ లో ఉన్న ఫైళ్లను క్లియర్ చేయకుండా పెండింగ్లో ఉంచటంతో పెద్ద ఎత్తున ఫైళ్లు కమిషనర్ లాగిన్లలోనే పెండింగ్‌లో ఉండిపోయాయి. తరచూ కమిషనర్లు మారుతూ ఉండటం వల్ల పరిపాలన అస్తవ్యస్తంగా మారుతోందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికే గడిచిన ఆరు నెలలుగా అభివృద్ధి పనులు దీర్ఘకాలికంగా జరగని పరిస్థితి నెలకొంది. ఇది చాలాదన్నట్టుగా టెండర్ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు చేస్తే బిల్లులు రాని పరిస్థితి నెలకొంది. ఒకవేళ ధైర్యం చేసి పనులు చేసినా ఎం బుక్కులు రికార్డింగ్ జరగటంలో ఇంజనీర్లు నత్తలతో పోటీ పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి చేసిన టెండర్ పనులకు గడచిన పది నెలలుగా బిల్లులు మంజూరు కాని పరిస్థితి నెలకొందని పలువురు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఈ క్రమంలో అటు ఉద్యోగుల్లోనూ ఇటు కాంట్రాక్టర్లలోనూ ఆత్మస్థైర్యం పెంపొందేలా చూడాల్సిన ముఖ్య నేతలు చోద్యం చూస్తుండటంతో అత్యవసర పనులపై వచ్చే నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ కమిషనర్ల మార్పులు జరగటం వలన కార్పొరేషన్ పరిపాలన అస్తవ్యస్తంగా మారిందనినగర ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.




బాధ్యతలు చేపడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

ప్రొబేషన్ కమిషనర్‌గా వినూత్న బాధ్యతల స్వీకరణ

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న ప్రొబేషన్ పీరియడ్ లో భాగంగా బాధ్యతలు చేపట్టారు ఇటీవల బాధ్యతలు చేపట్టిన కమిషనర్ వి మల్లికార్జున్ రెడ్డి ఆమె శిక్షణ కాలంలో సహాయ సహకారాలు అందించనున్నారు. ఈసందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ ప్రొబేషన్ పీరియడ్లో భాగంగా తాను కళ్యాణదుర్గం ఆర్డీవోగా బాధ్యతలు నిర్వర్తించానన్నారు అలాగే కూడేరు తహశీల్దార్ గా బాధ్యతలు చేపట్టానన్నారు. ప్రొబేషన్ పీరియడ్ లో భాగంగా అన్ని శాఖల పనితీరును అవగాహన చేసుకోవటానికి పని చేస్తామన్నారు. అలాగే ప్రొబేషన్ పీరియడ్ ఇంకా నాలుగు నెలల కాలం ఉండటంతో మున్సిపల్ కార్పొరేషన్‌లోని పరిపాలన తీరు తన్నులు తెలుసుకుంటానన్నారు. వివిధ విభాగాల అధికారులతో చర్చించి వారి విధులు బాధ్యతలు పనితీరును తెలుసుకుంటామన్నారు. పరిపాలన కమిషనర్‌గా మల్లికార్జున రెడ్డి వ్యవహరిస్తారని చెప్పారు. తాను మున్సిపల్ కార్పొరేషన్ పనితీరును తెలుసుకోవటానికి కమిషనర్ గా వ్యవహరిస్తానని అన్నారు

నామినేటెడ్ ఆశలు



త్వరలో భర్తీ చేయనున్నట్లు ప్రకటన
ఈసారైనా దక్కేనా అని ఎదురు చూపులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నామినేటెడ్ పదవుల పంపకాలు మరోమారు జరుగనుండటంతో ఆశావహుల్లో ఉత్కంఠత నెలకొంది. ఈసారి ఎవరికి పదవులు వర్తిస్తాయోనని ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రెండు,మూడు దఫాల్లో నామినేటెడ్ పోస్టుల నియామకాలు జరిగాయి. అయితే ఇందులో జిల్లాలోని టిడిపి ముఖ్యనేతలకు పెద్దగా పదవులు దక్కలేదు. మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డికి రాష్ట్ర ఛైర్మన్ పదవి దక్కగా, మాజీ జడ్పి ఛైర్మన్ పూల నాగరాజుకు రీజనల్ ఛైర్మన్ పదవి దక్కింది. తక్కిన వారికి డైరెక్టర్ల పోస్టులే దక్కయ్యాయి. ఉన్న జిల్లా స్థాయి అహుడా పోస్టు జనసేన నాయకులు టిసి.వరుణ్‌కు కూటమిలో భాగంగా ఇచ్చారు. ఇక తక్కిన ముఖ్యమైన పోస్టులేవి జిల్లాలో లేవు. దీంతో ఈసారి జరగబోయే నామినేటెడ్ పదవుల్లోనైనా జిల్లాకు ప్రాధాన్యతనిస్తారా లేదా అని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. గతంలో ఎప్పుడూలేని విధంగా ఉమ్మడి జిల్లాలో ఈసారి తెలుగుదేశం పార్టీ 14 స్థానాల్లోనూ విజయం సాధించింది. విజయానికి కష్టపడిన నేతలకు ఈ పదవుల పంపకాల్లో గుర్తింపు లభిస్తుందన్న నమ్మకంతో పదవులపై ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు. అయితే అధికారంలోనున్నది ఇప్పుడు మూడు పార్టీలు కలసి కాబట్టి సర్దుబాటుల్లో సర్దుకోవాల్సిందేనా అన్న నిరాశలోనూ కొంత మంది నేతలున్నారు.

త్యాగం చేసిన వారికి ఇక అంతేనా ?

2024 సార్వత్రిక ఎన్నికల్లో కొంత మంది సీనియర్లు తమ సీట్లను వదులుకుని పార్టీకి పనిచేశారు. వారికి ఇప్పటి వరకు ఎటువంటి ప్రాధాన్యత లభించలేదు. రాబోయే రోజుల్లోనైనా ఉంటుందా లేదా అని ఎదురు చూస్తున్నారు. ఈ రకంగా సిట్టింగు స్థానం వదలుకుని పార్టీ కోసం పనిచేసిన వారిలో అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఉన్నారు. ఆయనకు గత అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్టు ఇవ్వలేదు. ఆయన స్వతంత్రంగా బరిలో దిగుతారన్న ప్రచారమూ నడిచింది .అయితే ఆయన పార్టీకి పనిచేస్తానని చెప్పడమే కాకుండా పనిచేశారు. ఇప్పుడు ఆయనకు ఏ రకంగా న్యాయం చేస్తారన్న చర్చ నడుస్తోంది. ఇక యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ కూటమి పొత్తుల్లో భాగంగా ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్టు వదులుకున్నారు. ఆయనకు రాష్ట్ర స్థాయి ఛైర్మన్ పదవి దక్కుతుందని ప్రచారం నడిచినప్పటికీ మరొకరి ఇచ్చారు. ఇక జెసి.పవన్‌కుమార్‌రెడ్డి 2019 ఎన్నికల్లో పార్లమెంటు స్థానానికి పోటీ చేసి ఓటమి చెందారు. 2024లో ఆయనకు టిక్కెట్టు ఇవ్వలేదు. వీరే కాకుండా గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్, మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్నలు కూడా టిక్కెట్లు వదులుకున్న వారిలోనున్నారు. వారికి ఇప్పుడు పార్టీ ఏ రకంగా ప్రాధాన్యతను కల్పించనుందన్నదన్న చర్చ నడుస్తోంది. వీరే కాకుండా అనేక ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులూ ఉన్నారు. వీరికి ఈసారైన తగిన గుర్తింపు లభిస్తుందా లేక ఎప్పటిలాగానే మొండిచెయ్యి తప్పదా అన్న చర్చ ఆ పార్టీలో నడుస్తోంది.



బిఎస్ఎఫ్ జవాను వెంకటరమణారెడ్డి అంతిమయాత్ర

బిఎస్ఎఫ్ జవానుకు అశ్రు నివాళి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని నాగుల బావి వీధి కు చెందిన బిఎస్ఎఫ్ జవాను తలమర్ల వెంకట రమణ రెడ్డికి పట్టణ ప్రజలతోపాటు వివిధ అధికారులు, పోలీస్ అధికారులు, కేంద్ర బలగాల నడుమ అశ్రు నివాళులు అర్పించారు. మృతుడు తలమర్ల వెంకట రమణారెడ్డి కాశ్మీర్లో విధులలో ఉన్నప్పుడు గుండెపోటుకు గురై మృతిచెందాడు. మృతదేహాన్ని కాశ్మీర్ నుండి ఢిల్లీకు, ఢిల్లీ నుండి బెంగళూరుకు, బెంగళూరు నుండి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆర్మీ వాహనంలో ధర్మవరానికి శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటలకు చేర్చారు. చిన్న వయసులోనే ఇంతటి ఘోరం చూడాల్సి వస్తుందని కుటుంబ సభ్యులు,బంధువులు చేస్తున్న రోదనలు పలువురుని కంటతడి పెట్టించాయి. దేశ సేవ చేయాలన్న తలంపుతోనే ఆర్మీలో చేరిన తలమర్ల వెంకటరమణారెడ్డి ఇంకొన్ని రోజుల్లో రిటైర్డ్ అయి వస్తాడన్న ఆశతో ఎదురు చూసామని అంతలోనే ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో పాటు వైసిపి గుర్రం శ్రీనివాసరెడ్డి, చందమూరు నారాయణరెడ్డి, బ్రహ్మయ్య, మాసపల్లి సాయికుమార్, పట్టణంలోని వివిధ పోలీస్ స్టేషన్ లోని పోలీస్ సిబ్బంది, అధికారులు, తదితరులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడినుంచి వెంకటరమణారెడ్డి న సొంత గ్రామమైన డివిజన్ పరిధిలోని చెన్నె కొత్తపల్లి మండలం బసినేపల్లి గ్రామం వద్దకు మృతదేహాన్నిచేర్చారు. అక్కడ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అధికారులు, గ్రామ పట్టణ ప్రజల నడుమ కేంద్ర బలగాలు ప్రభుత్వ ఆధ్వర్యంలో అంత్యక్రియలను నిర్వహించారు. పట్టణం నుండి చెన్నె కొత్తపల్లి వరకు వందలాదిమంది పాల్గొని బిఎస్ఎఫ్ జవాను తుది వీడ్కోలు పలికారు.

'సూపర్ సిక్స్' అమలుకు పోరాడుదాం

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత



అనంత వెంకటరామిరెడ్డి, పెద్దారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో కూటమి నాయకులు ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలుకు పోరాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆలమూరు శ్రీనివాసరెడ్డి శుక్రవారం నగరంలోని స్వగృహంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అనంతం వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో అన్నివర్గాలకు మేలు చేకూరిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల పాలనలో పింఛన్లు తప్ప ఏ ఒక్క సంక్షేమ పథకం అందలేదన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి అనుబంధ సంఘాల అధ్యక్షులు సాకే చంద్ర, సైఫుల్లాబేగ్, కె.ఓబిరెడ్డి, ఎం.నరసింహులు, కె.శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకులు గౌస్‌బేగ్, మిద్దె భాస్కర్‌రెడ్డి, మారుతీనాయుడు, దిలీప్‌రెడ్డి, దేవాంగం రామయ్య, రవితేజ, జిలాన్, అనిల్‌కుమార్‌గౌడ్, చంద్రాయుడు, హుస్సేన్, అంజి, ఎం.శ్రీనివాసులు, కార్పొరేటర్లు చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, సంపంగి రామాంజనేయులు, కమల్‌భూషణ్, వడ్డే రామచంద్ర, నాయకులు నారాయణరెడ్డి, రషీద్, శివ, రాజారత్నం, నాగేంద్ర, నాగార్జున, పుల్లారెడ్డి, వాయిల శ్రీనివాసులు, నజీర్, రియాజ్, తిరుపతినాయుడు, కాకర్ల శ్రీనివాసరెడ్డి, సాధిక్, రామమూర్తి, రాజునాయక్, సత్తి రెడ్డి, విజయ్, హనుమంతు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్దమట్లగొందిలో రీసర్వే

తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య

ప్రజాశక్తి సింగనమల

రీసర్వే చేసేందుకు పైలెట్ ప్రాజెక్టుగా మండలంలోని పెద్దమట్లగొంది గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో రీసర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన పెద్ద మట్లగొంది గ్రామంలో శనివారం ఉదయం 10 గంటలకు గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ పునీత్, డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, మండల సర్వేయర్ స్టీఫెన్ వర్మ, సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి, వీఆర్వోలు శ్రీధర్‌రావు, తాతయ్య, నరసింహులు, నాగేంద్ర, రాముడు, నవీన్‌కుమార్, నాగేంద్ర, సచివాలయాల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు

ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలు పరిష్కరించండి

ఎండికి అనంత ఎంపి అంబికా వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎల్ఐసి ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈమేరకు శుక్రవారం ఎల్ఐసి ఎండి సత్పాల్‌భానును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ బీమా చట్టం, 1938లోని సెక్షన్ 42(2) సవరణల ప్రకారం ఎల్ఐసి ఏజెంట్లు, ప్రయివేట్ బీమా కంపెనీల పాలసీలను కూడా విక్రయించేందుకు అనుమతి ఇచ్చేందుకు ప్రతిపాదితమైందన్నారు. ఈ మార్పులు అభివృద్ధికి దారి తీసినప్పటికీ ఎల్ఐసి స్థిరత్వం, దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. 68ఏళ్లుగా ఎల్ఐసి ఏజెంట్ల నియామకాలు, శిక్షణ విధానాలను బలోపేతం చేస్తూ, అభిమానం, నమ్మకాన్ని పెంపొందించుకుందన్నారు. ఎల్ఐసి సంస్థ ఆయా సవరణల వల్ల ఏజెంట్లు, ఇతర సంస్థలకు మొగ్గుచూపే అవకాశాలు పెరుగుతాయన్నారు. తద్వారా ఎల్ఐసి మార్కెట్ వాటా తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే కృషి చేయాలని కోరారు.



ఎల్ఐసి ఎండికి వినతిపత్రం అందజేస్తున్న అనంత ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

వెంకటసాయి ఐటిఐ విద్యార్థికి గోల్డ్ మెడల్



బంగారు పతకం సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ నారాయణస్వామి

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రిలోని వెంకటసాయి ఐటిఐ విద్యార్థికి ఇంటర్నేషనల్ జంప్ రోప్ ఇండో నేపాల్ ఛాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మీసాల నారాయణస్వామి తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కళాశాలలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి మనోజ్‌కుమార్ ఆచారిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మనోజ్‌కుమార్ ఆచారి సాధారణ రైతు కుటుంబంలో పుట్టి ఐటిఐ ఎలక్ట్రికల్ మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. హైస్కూల్ దశలో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన మనోజ్‌ఆచారిని ప్రోత్సహించి వెంకటసాయి ఐటిఐ కళాశాల తరపున నేపాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ జంప్ రోప్ ఇండో నేపాల్ ఛాంపియనషిప్‌నకు పంపినట్లు తెలిపారు. ఈ ఛాంపియన్ షిప్‌లో బంగారు పథకం సాధించడం సంతోషించదగ్గ విషయమన్నారు.

పుట్లూరు ఎపిఒగా నరేంద్ర



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎపిఒ చెన్నకేశవులు

ప్రజాశక్తి-పుట్లూరు

పుట్లూరు ఎపిఒగా నరేంద్ర శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎపిఒగా విధులు నిర్వహిస్తున్న చెన్నకేశవులు అనంతపురం ఎపిడిగా వెళ్లడంతో తాడిపత్రి ఎపిడి అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నరేంద్రను ఇక్కడికి ఇన్‌ఛార్జి ఎపిగా నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

జాతీయ జూడో పోటీలకు కళ్యాణదుర్గం విద్యార్థి



జాతీయ పోటీలకు ఎంపికైన మహిధర్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

జాతీయ జూడో సబ్ జూనియర్ క్రీడా పోటీలకు కళ్యాణదుర్గం మండలం పాపంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి మహిధర్ ఎంపికయ్యాడు. ఇటీవల గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన మహిధర్ జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. మహారాష్ట్రలో జరగబోయే జాతీయ పోటీల్లో మహిధర్ పాల్గొననున్నాడు.

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించి జయప్రదం చేద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈ నెల 26వ తేదీన నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా అనంతరత్న, అనంతశ్రీ, అనంత భూషణ్, అనంత విభూషణ్ లాంటి అవార్డులను కొత్తగా అందించేలా చూడాలని, ఇందుకోసం అసిస్టెంట్ కలెక్టర్‌ని నోడల్ అధికారిగా నియమించామని చెప్పారు. ఈ వేడుకల కోసం ఇన్విటేషన్ కమిటీని ఏర్పాటు చేసి డిప్యూటీ కలెక్టర్‌ని ఇన్‌చార్జిగా నియమించాలన్నారు. పెరేడ్ గ్రౌండ్లో జడ్జీలు, ప్రజా ప్రతినిధులు, కుటుంబ సభ్యులు, జిల్లా అధికారులు, ప్రజల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆంవో ఎ.మాలోల, ఆర్డీవోలు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాల నివారణకు చర్యలు :

జిల్లాలో మాతృ మరణాలు నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాతా శిశు మరణాలపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. డెలివరీ సమయంలో కాంప్లికేటెడ్ రిఫరల్ కేసుల వల్ల మరణాలు సంభవించే అవకాశం ఉన్నందున సమయాన్ని వృథా చేయకుండా ముందస్తు వైద్య సదుపాయాలను ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ, మండల స్థాయిలోని చిన్న ఆసుపత్రుల నుండి పెద్ద ఆసుపత్రులకు వెళ్లే సమయంలో వారికి ముందస్తు సమాచారాన్ని అందించి తక్షణమే వైద్యం అందించే విధంగా ఏర్పాట్లు చేసుకుని, తరువాత రోగులను వైద్య సిబ్బందితో కూడిన అంబులెన్స్ లో తరలించే విధంగా చూడాలన్నారు. ఈ సంవత్సరంలో జరిగిన 4 మాతృ మరణాల కేసులకు సంబంధించి ం నిపుణులైన వైద్య సిబ్బంది కూడిన కమిటీ ద్వారా విచారణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ. దేవి, డిసిహెచ్ఎస్ పాల్ రవికుమార్, ఐసిడిఎస్ పీడీ వనజ అక్కమ్మ, ప్రభుత్వ ఆసుపత్రి గైనిక్ విభాగ అధికారి డాక్టర్ శంషాద్ బేగం, డిసిహెచ్ఎస్ ఇంచార్జ్ డాక్టర్ డేవిడ్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్యుడు డాక్టర్.నవీన్ కుమార్, బ్లడ్ బ్యాంక్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, డిఐఒ డా.యుగంధర్, వైద్య సిబ్బంది డిఎస్ రాజు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రవాణా దుర్వినియోగంపై అవగాహన కల్పించాలి

జిల్లాలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు దుర్వినియోగంపై పాఠశాలలు, కళాశాలల్లో జిల్లా మానసిక ఆరోగ్య బృందంచే మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్సిఓఆర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికలను తయారు చేయాలని డిఎంహెచ్ఒ, మానసిక ఆరోగ్య అధికారులకు సూచించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పూర్తి స్థాయి డి-అడిక్షన్ వార్డుకు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ వార్డుకు సంబంధించి పూర్తి స్థాయిలో సిబ్బంది, సామగ్రి ఎంత కావాలో నివేదికలను తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామ్మూర్తి, డిఆర్ఒ ఏ.మాలోల, ఆర్డీవో కేశవ నాయుడు, డిటిసి వీర్రాజు, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ డిడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

'బేస్ మ్యాప్' తయారీపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఇంజినీర్లు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తాగునీటి పైపులైన్లు, మురుగు కాలువలు, రహదారుల పొడవు, తదితర వివరాలతో కూడిన వార్డుల వారీగా బేస్ మ్యాప్ తయారు చేయడంపై శుక్రవారం సమావేశ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీర్లు మాట్లాడుతూ ప్లానర్స్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ కలిసి రహదారులు, మురుగు కాలువలు, తాగునీటి పైప్ లైన్ల వివరాలతో కూడిన వార్డుల వారీగా బేస్‌మ్యాపులు తయారు చేసి అందులో మార్కింగ్ చేస్తూ వివరాలను రూపొందించాలన్నారు. దీనివల్ల ఆయా వార్డుల్లో ఎంత మేరకు కాలువలు, రహదారులు నిర్మించాల్సి ఉంటుంది, నిర్మించిన వాటి సంఖ్య, నిర్మించాల్సిన వాటి వివరాలు స్పష్టంగా తెలుస్తాయన్నారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాధాకృష్ణ, షాకీర్‌హుస్సేన్, ఇన్‌ఛార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్ శిరీషా, టిపిఎస్ దుర్గాంజలి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నరసింహా, సుభాష్ చంద్రబోస్, అసిస్టెంట్ ఇంజినీర్లు రాజశేఖర్‌రెడ్డి, హరీష్, విజయరాజు, తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పార్కులోని పదిచెట్లను నరికించిన మున్సిపల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మల్లికార్జున పార్టీ నాయకులు మధు, నాగరాజు, తిమ్మరాజు, ఆంజనేయులు తో పాటు మున్సిపల్ కమిషనర్‌ను కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కులో పది చెట్లు నరికి వేశారన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పని చేసే ఫిట్టర్ జగన్నాథ, కోదండరాముడు, రజాక్ కలిసి చెట్లను నరికించినట్లు తెలిసిందన్నారు. ఇలాంటి చెట్ల నరికివేత మిగతా పార్కుల్లో కూడా జరిగాయో.. లేదో.. విచారించాలన్నారు. సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే వారిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఎం నాయకులు మధు, నాగరాజు, తిమ్మరాజు, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

అమినిటీ కార్యదర్శి మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న మేయర్ వసీం, నాయకులు

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థలో అమినిటీ కార్యదర్శిగా పని చేస్తున్న బాబు మృతికి మేయర్ మహమ్మద్ వసీం సంతాపం వ్యక్తం చేశారు. అమినిటీ కార్యదర్శి బాబు బ్రెయిన్ ట్యూమర్‌తో శుక్రవారం మృతి చెందారు. దీంతో నగరపాలక సంస్థ కార్యాలయంలో బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. నివాళులర్పించిన వారిలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డి, కమిషనర్ మల్లికార్జునరెడ్డి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అబుసాలేహా, సంపంగి రామాంజినేయులు, శేఖర్‌బాబు, సచివాలయ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండలానికి 24 యూనిట్లు మంజూరు

పుట్లూరు : మండలానికి 24 యూనిట్లు మంజూరైనట్లు ఎంపిడిఒ అలివేలమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిసిలకు సంబంధించి 20, ఈబిసిలకు రెండు, రెడ్డి సామాజిక వర్గానికి ఒకటి, కమ్మ సామాజిక వర్గానికి ఒక యూనిట్ మంజూరైనట్లు తెలిపారు.

కూతలేరు పరిసరాలు పరిశుభ్రం



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న దృశ్యం

నార్పల : ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని కూతలేరు వంతెన సమీపంలో గురువారం రాత్రి వేసిన బంకుతోపాటు పరిసర ప్రాంతాలను శుక్రవారం శుభ్రం చేశారు. ఇందులో భాగంగా ఇఒఆర్‌డి శైలజారాణి, పంచాయతీ కార్యదర్శి శ్యామల ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి కూతలేరులోని వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా వ్యాపారులు, దుకాణదారులు తమ దుకాణాల్లోని వ్యర్థాలను కూతలేరులో వేస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. ః

ఫీవర్ సర్వే తనిఖీ

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో చేపట్టిన ఫీవర్ సర్వేను తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికీ రక్తపూతలు తీయాలని ఎఎన్‌ఎం విజయ మేరీకి సూచించారు. రక్తపూతలను యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ కు పంపాలన్నారు. కాగా ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం ల్యాబ్‌ను తనిఖీ చేసి టెక్నీషియన్ శిరీషకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సుబ్బలక్ష్మి, సులోచన, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమంలో దుస్తులు పంపిణీ

యాడికి : మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో జానపాటి శ్రీనివాసులు (ప్రెస్), భార్య శ్రీదేవి, కుమార్తె వర్షశ్రీ, త్రిశశ్రీ, కుమారుడు వెంకట సాయి మోక్షిత్ శుక్రవారం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య పవన్, సన్నిహితులు, ఆశ్రమ నిర్వాహకులు బత్తల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

బెలుగుప్ప : ప్రతి అక్షరం ప్రజల పక్షంగా ముందుకు సాగుతున్న ప్రజాశక్తి దినపత్రిక దినదినాభివృద్ధి చెందాలని డాక్టర్ కార్తీ కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆసుపత్రిలో డాక్టర్ ప్రియాంకతో కలిసి ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి వార్తలు రాస్తున్న ఏకైక దినపత్రిక ప్రజాశక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ వెంకటరమణ, వసంతమ్మ, రాంబాబు, సరోజ, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కార్తీ కుమార్‌రెడ్డి, తదితరులు

సుజానాచౌదరిని కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి



ఎమ్మెల్యే సుజానాచౌదరికి బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మాజీ కేంద్ర మంత్రి, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనాచౌదరిని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుజనా చౌదరి కార్యాలయంలో మర్యాదపూర్వకంటా కలిసి పూల మొక్కను అందజేశారు. పలు అంశాల గురించి ఇరువురు నేతలు చర్చించుకున్నారు. అనంతపురం అభివృద్ధిపై సుజనా చౌదరి అడిగి తెలుసుకున్నారు. మొదటి సారి ఎమ్మెల్యే అయ్యారు కదా జిల్లా కేంద్రంలో అభివద్ధి ఎలా ఉంది. నేతల సహకారం ఇతరత్రా అంశాల గురించి ఆరా తీశారు. అభివద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని ఇంకా కీలకమైన హామీలకు నిధులు రావాల్సి ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి వివరించారు. మరోవైపు జిల్లా రాజకీయాల గురించి సుజనా ఆరా తీశారు. కూటమి పార్టీలు ఐక్యంగా ముందుకెళ్తాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి స్పష్టం చేశారు. కేంద్ర సాయంతో రాష్ట్రంలో మరిన్ని అభివద్ధి కార్యక్రమాలు జరుగుతాయని సుజనా చౌదరి అన్నారు.

జిల్లాస్థాయి ఇస్తేమాకు ఏర్పాట్లు పూర్తి



ముస్తాబైన వేదిక

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని క్రాస్‌లో నేటి నుంచి రెండు రోజులపాటు జిల్లాస్థాయి ఇస్తేమా కార్యక్రమం నిర్వహించనున్నారు. దాదాపు 12ఏళ్ల తర్వాత నార్పలలో ఇస్తేమా నిర్వహించనుండటంతో భారీగా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా వేలాదిమంది ముస్లింలు తరలిరానున్నారు. ఇందులో భాగంగా వచ్చే అతిథులకు ఎలాంటి ఆసౌకర్యం కలగకుండా కూర్చోవడానికి షామియానాలు, నీటి సౌకర్యం, భోజన ఏర్పాట్లు, వజుఖానాలు, సౌశాలయాలు, మొదలగు ఏర్పాట్లు ఏర్పాటు చేశారు. స్థానిక ముస్లింలు ముస్లిం యువకులు రాత్రింబవళ్లు ఇస్తేమా ప్రదేశాన్ని తీర్చిదిద్దుతున్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి ఆధ్యాత్మిక బోధనలు, ప్రార్థనలు మొదలై ఆదివారం రాత్రి దువాతో ఇస్తేమా కార్యక్రమం ముగియనుంది.

పంచాయతీ ఆధ్వర్యంలో లైట్లు ఏర్పాటు

మండల కేంద్రంలోని క్రాసింగ్ సమీపంలో రెండురోజులపాటు నిర్వహించనున్న ఇస్తేమా నేపథ్యంలో పంచాయతీ ఆధ్వర్యంలో లైట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచు సుప్రియ, ఇఒఆర్‌డి శైలజారాణి, కార్యదర్శి శ్యామల దగ్గరుండి ఇస్తేమా జరిగే ప్రదేశంలో రోడ్డుకి ఇరువైపులా లైట్లు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ లైన్ ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణారెడ్డి, కాంటాక్టు హెల్పర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా, అనంతపురం జిల్లా చిన్న పొడమల గ్రామంలో డోర్ నెంబర్ 3-66-4 నందు నివశించు శ్రీమతి జి.వకులాదేవి W/O భర్త జి.గోపాల్ అను ఆమెకు హక్కు అనుభవము గల క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని ఏదైనా బ్యాంకు నందు ఆయకము ఉంచి రుణమును పొందవలెనని అనుకున్నారు. అయితే శ్రీమతి జి.వకులాదేవి W/O జి.గోపాల్ గారికి సంబంధించిన క్రింది షెడ్యులు దాఖలా ఆస్థికి సంబంధించి ఒరిజినల్ లింకు పత్రము శ్రీ అనంతపురం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం.6493/1989 గా రిజిష్టరు కాబడినది. సదరు పత్రమును శ్రీమతి జి.వకులాదేవి గారు జిరాక్స్ చేయించుకొను నిమిత్తము తీసుకుని వెళుతుండగా పొగొట్టుకుని పోయినది. కావున ప్రస్తుతము తన వద్ద నకలు పత్రములు మాత్రమే ఉన్నవని తెలిపియున్నారు. కావున ఎవరికైనా క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని గురించి ఎలాంటి విక్రయములు గాని, తకరార్లు గాని, ఆయకములు గాని ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 10 నుండి 15 రోజుల వ్యవధిలోపు నాకు తెలియజేయ గోరుచుకున్నాను. పైన తెలిపిన 15 రోజుల గడువులోపల షెడ్యూలు దాఖలా ఆస్థిని గురించి ఎలాంటి ఆక్షేపణలు రాని యెడల పై తెలిపిన జి.వకులాదేవి W/O జి.గోపాల్ గారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థికి సంబంధించి తన పేరు ఉన్న ఒరిజినల్ పత్రములు ఏదైనా బ్యాంకులో డిపాజిట్ చేసి రుణమను పొందుదురని తెలుపడమైనది.

షెడ్యూలు

అనంతపురం రెవెన్యూ డివిజన్ అనంతపురం సబ్ డివిజన్‌కు చేరిన అనంతపురం రూరల్ గ్రామ పొలంలో శ్రీమతి జి.వకులాదేవి గారి హక్కు అనుభవం గల ఆస్థి

బాబు	వివరం	సర్వే నెంబర్	ఏ.సి	ఏ.సి	హెస్.ఎస్	ఫ్లాట్ నెంబర్
సర్కారు	ఖుష్కీ	398	11.48పైకి,	0.05.05,	0.020,	102

ఇందుకు చెక్కుబంది:
తూర్పు: ప్లాటు నెంబరు 115
దక్షిణం: ప్లాటు నెంబరు 101
పడమర: రోడ్డు
ఉత్తరం: ప్లాటు నెంబరు 103
ఈ మధ్యగల **తూర్పు-పడమర** 55 అడుగులు లేక 16.76 మీటర్లు, **ఉత్తర- దక్షిణం** 40 అడుగులు లేక 12.19 మీటర్లు, ఈ విశాలం గల ఐదు పాయింట్ సున్నా ఐదు సంట్లు లేక 244.44 చదరపు సెంట్లు గల ప్లాటు నెంబరు 102 మాత్రము

ఇట్లు
తమరి విధేయురాలు
జి.వకులాదేవి,
అడ్వకేట్స్



నడిరోడ్డుపై ఏర్పడిన లోతైన గుంత

ఆదమరిస్తే అంతే..

బుక్కరాయసముద్రంలో నడిరోడ్డుపై గుంత ప్రమాదాల బారిన వాహనదారులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

'ఆదమరిచారా అంతే.. ప్రమాదాల బారిన పడాల్సిందే.. చిన్న గుంతే కదా అని వాహనం దింపితే.. కింద పడాల్సిందే..' మండల కేంద్రం సమీపంలోని చెరువు కట్ట వద్ద ఏర్పడిన లోతైన గుంత వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అనంతపురం నుంచి తాడిపత్రి వైపు వెళ్లే మార్గంలో బుక్కరాయసముద్రం చెరువు కట్ట వద్ద సూపర్ కె మార్కెట్ సమీపంలో నడిరోడ్డుపై పెద్ద లోతైన గుంత ఏర్పడి నిత్యం నీటితో నిండి ఉంటోంది. నీరు నిలుస్తుండటంతో గుంత ఎంత లోతు ఉందో తెలియక వాహనదారులు గుంతలోకి వాహనాలను దింపుతుండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ గోతి వల్ల ఇప్పటికే చాలామంది ప్రమాదాల బారిన పడినట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి గుంటను తలపిస్తున్న నడిరోడ్డుపై గుంతను పూడ్చాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



శ్రీకృష్ణదేవరాయులుకు నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

శ్రీకృష్ణదేవరాయలుకు నివాళి

ప్రజాశక్తి-గుత్తి

శ్రీకృష్ణదేవరాయులు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబాబు, కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ తులువ వంశానికి చెందిన విజయనగర చక్రవర్తి శ్రీ కృష్ణ దేవరాయలు తన 20ఏళ్ల వయసులోనే విజయనగరాల సింహాన్ని ఆధిష్టించారన్నారు. రాయలు ఆంధ్ర, కర్ణాటక, రాష్ట్రాలను పరిపాలించిన గొప్ప చక్రవర్తిలలో ఆంధ్ర భోజుడిగా, సాహితీ సమరాంగణ సార్వభౌముడిగా కీర్తించబడ్డారని వివరించారు.కటకం వంటి గొప్ప రాజ్యాలను యుద్ధంలో గెలిచి తన గజ బలాన్ని పెంచుకుని శత్రురాజులను భయ కంపితులను చేసారన్నారు. అష్ట దిగ్గజ కవులను తన కొలువులో నిలిపిన సాహిత్య సార్వ భౌముడు అన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబూబాకర్, ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ,కోశాధికారి ఫక్రుద్దీన్, సభ్యులు వెంకటేష్, షేక్షావలి, శామ్యూల్, గోవిందప్పు, నారాయణ శెట్టి, చెన్నారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు సహకరించాలి



సమస్యలను విన్నవిస్తున్న రైతులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్


త్వరలో గ్రామాల్లో చేపట్టనున్న రీసర్వేకు రైతులు సహకరించాలని తహశీల్దార్ మునువేలు సూచించారు. శుక్రవారం మండలంలోని గోనేహాల్‌లో రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో గతంలో నిర్వహించిన రీసర్వేలో కొన్ని జాయింట్ ఎల్పీలు వచ్చాయన్నారు. వాటిని పూర్తిగా నివారించడానికి రైతులందరూ సహకరించాలని కోరారు. అంతేగాకుండా రీసర్వే చేసిన సమయంలో కొంత భూమి ఎక్కువ.. తక్కువ రావచ్చని, రైతులందరూ సహకరిస్తే అతిత్వరలో పూర్తి చేస్తామని తెలిపారు అనంతరం జడ్పిటిసి జగన్నాథరెడ్డి మాట్లాడుతూ రీసర్వే తర్వాత భూముల పాసుపుస్తకాల్లో వచ్చిన జాయింట్ ఎల్పి నెంబర్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుంగభద్ర జలాశయం సాగునీటి సంఘం ఉపాధ్యక్షులు కేశవరెడ్డి, ఆర్ఐ బాలకృష్ణ, ఇన్‌ఛార్జి విఆర్‌ఒ సుజాత, సర్వేయర్ రవితేజ, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్

యల్లనూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ప్రతి 3వ శనివారం మండలవ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు అందరూ పాల్గొంటారని తెలిపారు.

పంచాయతీరాజ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

గుత్తి : పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను అధికారులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ సిఇ ఎస్ఆర్. సుబ్బారెడ్డి, ఎస్ఇ జంధర్ అస్లాం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ప్రభాకర్‌రెడ్డి, డిఎల్ శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డిఎల్.మురళీధర్, ఎగ్జిక్యూటివ్ కార్యవర్గ సభ్యులు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎపి పంచాయతీ రాజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న అధికారులు

కుల్లాయిస్వామి ఆలయ హుండీ లెక్కింపు

నార్పల : మండల పరిధిలోని గూగూడులో వెలసిన కుల్లాయిస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా రూ.16,53,160 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకేతపురం శోభ తెలిపారు.

పరిశుభ్రత పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-యల్లనూరు

ప్రతి ఒక్కరూ పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తాడిపత్రి సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని తిమ్మంపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఉన్న గొడ్డుమర్రి గ్రామంలో డ్రై డే ఫ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ముఖ్యంగా మంచి నీటితొట్టెలు, డ్రమ్ములు, ట్యాంకుల్లో నీటిని వారానికోసారి పూర్తిగా తీసివేసి ఎండబెట్టుకోవాలన్నారు. అలాగే దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడలన్నారు. దోమలు ఇంట్లోకి ప్రవేశించకుండా ఇంటి కిటికీలకు మెస్‌ను బిగించుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి చూపించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ఎస్.రాము, ఎస్.విజయలక్ష్మి, ఎఎన్‌ఎంలు వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి సౌజన్య, ఆశా కార్యకర్త భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION), GOOTY.
E.P.NO. 23/2021 in O.S.NO. 157/2018

Between:
P.Chidananda Reddy ...D.Hr
AND
1] K.Surya Narayana
2] K.Uma Devi ...J.Drs 1 & 2

వేలం ప్రకటన

పై D.Hr తనకు J.Drs నుండి రావలసిన డిక్రీ బాపతు పైకం రూ.11,78,492/–లు రాగోరి, J.Dr No.2 హక్కు, స్వాధీనం అనుభవంలో వున్న క్రింది షెడ్యూలులోని స్థిరాస్థిని దావా తీర్పునకు ముందే జప్తి చేసి, వేలమునకు తెచ్చి వుంటున్నాడు. కనుక 20/01/2025వ తేది సదరు కోర్టు వద్ద జరుగు బహిరంగ వేలములో పాల్గొనదలచిన సవాలు దార్లు వాయిదా దినం 20/01/2025న ఉదయం 10:30 గంటలకు స్వయముగా హాజరై వేలము షరతులకు లోనై జరుగు వేలంలో పాల్గొనవలసినదిగా ఈ నోటీసు మూలకంగా తెలియపరచడమైనది.

SCHEDULE

House having Ground Floor & First Floor bearing Door No 20/141-B2 situated in Sy.No 445/C2 at Hanumesh Nagar within Guntakal Municipal Area within SRD of Guntakal and RD of Ananthapuram with the following particulars :

Boundaries:
East: House bearing D No 20/140C of Sreenivasa Murthy
West: House bearing D.No. 20/141-B1 of K.Murali Krishna
North: Road
South: House of Govindu
In between house measuring:
East - West : 11 Feet or 3.35 Mts
North - South : 33 Feet or 10.06 Mts
D.Hr.Value :: Rs. 20,00,000-00
Amin Value ::Rs. 25,00,000-00

// By Order of the Court //

S.EDURU VALI
Advocate for the D.Hr

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION), GOOTY.
E.P.NO. 38/2021 in O.S.NO. 158/2018

Between:
P.Chidananda Reddy ...D.Hr
AND
1] K.Surya Narayana
2] K.Uma Devi ...J.Drs 1 & 2

వేలం ప్రకటన

పై D.Hr తనకు J.Drs నుండి రావలసిన డిక్రీ బాపతు పైకం రూ.1738,665/–లు రాగోరి, J.Dr No.2 హక్కు, స్వాధీనం అనుభవంలో వున్న క్రింది షెడ్యూలులోని స్థిరాస్థిని దావా తీర్పునకు ముందే జప్తి చేసి, వేలమునకు తెచ్చి వుంటున్నాడు. కనుక 20/01/2025వ తేది సదరు కోర్టు వద్ద జరుగు బహిరంగ వేలములో పాల్గొనదలచిన సవాలు దార్లు వాయిదా దినం 20/01/2025న ఉదయం 10:30 గంటలకు స్వయముగా హాజరై వేలము షరతులకు లోనై జరుగు వేలంలో పాల్గొనవలసినదిగా ఈ నోటీసు మూలకంగా తెలియపరచడమైనది.

SCHEDULE

House having Ground Floor & First Floor bearing Door No 20/141-B2 situated in Sy.No 445/C2 at Hanumesh Nagar within Guntakal Municipal Area within SRD of Guntakal and RD of Ananthapuram with the following particulars :

Boundaries:
East: House bearing D No 20/140C of Sreenivasa Murthy
West: House bearing D.No. 20/141-B1 of K.Murali Krishna
North: Road
South: House of Govindu
In between house measuring:
East - West : 11 Feet or 3.35 Mts
North - South : 33 Feet or 10.06 Mts
D.Hr.Value :: Rs. 20,00,000-00
Amin Value ::Rs. 25,00,000-00

// By Order of the Court //

S.EDURU VALI
Advocate for the D.Hr

20 నుంచి కుష్టువ్యాధి సర్వే



శింగనమలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-శింగనమల

ఈనెల 20 నుంచి వచ్చేనెల 2వతేదీ వరకూ కుష్టువ్యాధిపై సర్వే నిర్వహించనున్నట్లు తరిమెల పిహెచ్‌సి డాక్టర్ శంకర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైద్య సిబ్బందికి కుష్టువ్యాధి సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 14 రోజులపాటు వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుష్టువ్యాధి గ్రస్థులను గుర్తించాలన్నారు. మచ్చలు, రాగి రంగు మచ్చలు, స్పర్శలేని మచ్చలు ఏమైనా ఉంటే గుర్తించాలన్నారు. అలాంటి మచ్చలు ఉంటే కుష్టువ్యాధి లక్షణాలుగా గుర్తించి స్థానిక వైద్యశాలకు సిఫారసు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సవిత, అరవింద్, శంకర్‌నాయక్, సూపర్‌వైజర్లు నాగమ్మ, అశ్వర్థనారాయణ, హెల్త్ ప్రొవైడర్ దివ్యభారతి, ఆరోగ్య కార్యకర్తలు తిరుపాలమ్మ, శైలజ, హెల్త్‌ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టువ్యాధి సర్వేపై డాక్టర్ తేజస్విని ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యసిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డిపిఎంఒ రామచంద్రయ్య మాట్లాడుతూ శిక్షణ పొందిన వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి స్పర్శ లేని, రాగిరంగు మచ్చలు ఉన్న వారిని గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపి చికిత్సను తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో భారతి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, శర్మస్‌వలి, లక్ష్మీకుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెద్దపప్పూరు డాక్టర్ తేజస్విని

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టువ్యాధి సర్వేపై వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలకు వైద్యాధికారి రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాదికారి మాట్లాడుతూ వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుష్టువ్యాధి లక్షణాలపై సర్వే చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని ఆధ్వర్యంలో కుష్టువ్యాధి సర్వేపై వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు వెళ్లి కుష్టువ్యాధి గ్రస్థులను గుర్తించాలన్నారు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో టి.మోహన్‌బాబు, సామాజిక ఆరోగ్య అధికారిణి పర్వీన్, సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు : కోవెలకుంట్ల
ఓ.ఎస్.నెం.100/2020

పసుపులేటి గంగమ్మ, వయస్సు 55 సం॥లు.
భర్త శివయ్య, హిందు, కూలి పని వలన జీవనం
R/o కోవెలకుంట్ల Town and mandal,
కర్నూలు జిల్లా Now at నంద్యాల జిల్లా. ...వాది

-Vs-

పి.లక్షుమమ్మ. వయస్సు 40 సం॥ రాలు
భర్త ఆంజనేయులు, హిందు, వ్యాపారం,
వలన జీవనం గజిరగట్టు పల్లె గ్రామం,
నియర్ బుగ్గ తాడిపత్రి మండలం, అనంతపురం జిల్లా.

ప్రతివాదికి దావా సమన్లు

వాది తావున ప్రతి వాదికి తేది : 27-01-2025 సం॥రం ప్రామిసరి నోటు బాకినిమిత్తం వ్రాయించినావు. కావున నీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంప్పించిన సరియనైన అడ్రసులో లేని కారణంగా కోర్టులో వారి ఉత్తర్వుల మేరకు నీవ్వు కాని, వకీలు ద్వారా కాని 27-01-2025వ తేదిన ఉదయం 10.30 నిమిషాలకు పై కోర్టువారు ఎదుట హాజరు కావలెను అలా కాని యెడల కోర్టువారు ఎక్స్‌పార్టిగా తీర్మానించుదురు అని తెలియజేయడం అయినది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది : 27-01-2025

సి.ఎస్ శేషు,
వాది పరం న్యాయవాది,
కోవెలకుంట్ల.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

పెద్దపప్పూరు : మండలంలోని చాగల్లు గ్రామంలో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గంగరాజు, గంగాదేవి కుమారుడు మంజునాథ్ (23) తనకు పల్సర్ బైక్ కొనివ్వాలని తల్లిదండ్రులను అడిగాడు. అయితే తల్లిదండ్రులు నిరాకరించడంతో శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అయితే శనివారం ఉదయం మామిడి తోటలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గమణించిన స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భార్యను హత్య చేసిన భర్త

తాడిపత్రి : పట్టణంలోని ఓ లాడ్జిలో భార్యను ఓ భర్త కొడవలితో నరికి కిరాతకంగా హత్య చేసిన ఘటన చోటు చేసుకుంది. పుట్లూరు మండలం వెంగన్నపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి, తన భార్య పుష్పావతి(35) మధ్య దాదాపు నాలుగేళ్ల నుంచి మనస్పర్థల ఉన్నాయి. దీంతో పుష్పావతి పుట్టిల్లు బందర్లపల్లి గ్రామంలో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. అయితే వెంకటేశ్వర్‌రెడ్డి తన ఆస్తిని అమ్మకానికి పెట్టాడు. ఇందుకు భార్య పుష్పావతి అంగీకరించలేదు. ఈనేపథ్యంలో వెంకటేశ్వర్‌రెడ్డి తన ఆస్తిని కొడుకుల పేరుపై రాయిస్తాని.. ఈ విషయమై మాట్లాడేందుకు పుష్పావతితోపాటు తల్లిదండ్రులు, కొందరు పెద్ద మనుషులు కలిసి తాడిపత్రిలోని ఓ గెస్ట్‌హౌస్‌లో సమావేశమయ్యారు. ఇదే అదునుగా భావించిన వెంకటేశ్వర్‌రెడ్డి తన భార్యతో మాట్లాడాలని భార్య పుష్పావతిని గది నుంచి బయటకు పిలిచి వేట కొడవలితో నరికి పరారయ్యాడు. దీంతో పుష్పావతి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు లాడ్జి వద్దకు వచ్చి కొడవళిని స్వాధీనం చేసుకుని మతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

గుత్తి : మండలంలోని ఈశ్వరపల్లి గ్రామంలో ఓ రైతు చెందిన వేరుశనగ పొట్టు, గడ్డివామి శుక్రవారం అగ్నికి ఆహుతైంది. బాధిత రైతు తెలిపిన వివరాలిలా మేరకు.. గ్రామానికి చెందిన రైతు పెద్దన్న తనకున్న పశువులకు గ్రాసం కోసం రూ.50వేలు వెచ్చించి వేరుశనగ పొట్టు కొనుగోలు చేసి ఇంటి సమీపంలో వామిగా ఏర్పాటు చేసుకున్నాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తి సిగరేట్ తాగి ఆర్పకుండా పడేయడంతో చెత్త అంటుకుని పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి గడ్డివాము అగ్నికి ఆహుతైంది. గమనించిన ఇతర రైతులు మంటలను చూసి కేకలు వేసి అందరినీ అప్రమత్తం చేసినా ఫలితం లేకుండా పోయింది. తర్వాత గుంతకల్లు అగ్నిమాపక వాహనానికి సమాచారం అందించారు. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపుచేసే లోగా వేరుశనగ పొట్టు, వరిగడ్డి మొత్తం కాలిపోయి పనికి రాకుండా పోయింది. ఫలితంగా రూ.50వేలు నష్టం వాటిల్లడంతోపాటు తన పశువులకు గ్రాసం లేకుండా పోయిందని రైతుకన్నీరు మున్నీరుగా విలపించాడు. ప్రభుత్వం రైతును ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం రూరల్

మండల పరిధిలోని లోని గూబనపల్లి గ్రామ సమీపంలో బళ్లారి రోడ్డు విజ్ఞాన జ్యోతి స్కూల్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందాడు. శెట్టూరు మండలం లక్ష్మంపల్లికి చెందిన ఫారుక్ (25), తాసిర్ (16) ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి కిందికి పడ్డారు. కిందికి పడిన వారిపై లారీ వెళ్లడంతో ఫారూక్, తాసీర్ అక్కడికక్కడే మృతిచెందారు.